
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ; 9 ; జూన్ ; 2025



సోమశిలలో 40.48 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారానికి 40.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3930 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,120
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,980
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,249
నవర (8 గ్రాములు)	రూ.73,992

గరిష్టం/కనిష్టం 40.3 /30.4

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు సోమవారం అధికంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 47 శాతంగా ఆదివారం నమోదైంది.

న్యూస్‌రీల్

మరొకరికి కరోనా పాజిటివ్

• ఎనిమిదికి చేరిన కేసుల సంఖ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఆదివారం నిర్వహించిన పరీక్షల్లో మరొకరికి కరోనా నిర్ధారణైంది. వనంతోపు సెంటర్‌కు చెందిన 61 ఏళ్ల మహిళ జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. అనుమానమొచ్చిన డాక్టర్లు అదే ఆస్పత్రిలో పరీక్ష చేయగా, కరోనాగా కన్పర్మైంది. స్వల్ప లక్షణాలుండటంతో వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం ఆమె హోమ్ ఐసోలేషన్లో ఉన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎనిమిది కేసులు నమోదు కాగా, అందులో నగరంలోనే ఐదు ఉన్నాయి. కాగా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగు జాగ్రత్తలు పాటిస్తూ మాస్కులను ధరించాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు.

గురుపరంపరతోనే సనాతన ధర్మ పరిరక్షణ



పూజలు చేస్తున్న శంకరవిజయేంద్ర సరస్వతి

నెల్లూరు(బృందావనం): ప్రపంచంలోనే భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైందని, దీన్ని కొనసాగించేందుకు గురుపరంపర ఎంతో ముఖ్యమని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పేర్కొన్నారు. అల్లీపురంలో విఘ్నేశ్వరాలయ పునఃప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన మూలాపేటలోని శంకరమఠంలో బస చేశారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి హారతులిచ్చారు. భక్తులకు మంగళశాసనాలను అందజేసిన అనంతరం తిరుపతి పయనమయ్యారు.

ఆశ వర్కర్లకు పనిభారం తగ్గించాలి




నెల్లూరు(వీఆర్సీసెంటర్): పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశ వర్కర్లతో సంబంధంలేని ఇతర పనులు చేయించకూడదని, వీరికి పని భారాన్ని తగ్గించాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడారు. వీరికి కనీస వేతనం అందడంలేదని, ఉద్యోగ భద్రత లేదని ఆరోపించారు. అనేక యాప్‌లను ఇచ్చి.. ఎలాంటి శిక్షణ నిర్వహించకుండానే పనిభారాన్ని పెంచుతున్నారని చెప్పారు. విజయలక్ష్మి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై లక్ష్మీనృసింహుడి విహారం



రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. శ్రీవారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకొని అభిషేకం, పుష్పాలంకారం, శాంతి హోమం, కల్యాణాన్ని నిర్వహించారు. బంగారు గరుడవాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి.. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కోన మాడవీధుల్లో ఊరేగించారు.

రూటు మార్చిన కార్పొరేటు



జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు రూటు మార్చాయి. ఇప్పటి వరకు స్టేట్ సిలబస్‌పై దృష్టి సారించిన వీరి కళ్లు.. తాజాగా సీబీఎస్‌ఈపై పడ్డాయి. ఐఐటీ, నీట్, సివిల్స్ తదితర పోటీ పరీక్షల్లో ఈ విధానం ద్వారా విద్యనభ్యసించిన వారే ర్యాంకులను సాధిస్తున్నారనే ప్రచారం జోరందుకున్న తరుణంలో దీనిపై మక్కువ నానాటికీ పెరుగుతోంది. ఫలితంగా ఖర్చు ఎంతైనా తమ పిల్లలను ఇక్కడే చదివించేందుకు తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న యాజమాన్యాలు సీబీఎస్‌ఈ స్కూళ్లు ఏర్పాటు చేసి చక్కగా క్యాష్ చేసుకుంటున్నాయి.

- ఇప్పుడు క్రేజంతా సీబీఎస్‌ఈపైనే
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న స్కూళ్లు
- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ
- ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు
- క్వాలిఫైడ్ ఫ్యాకల్టీలకు కరువు

జిల్లాలో ఇలా..

స్కూళ్లు -	25కుపైగా
విద్యార్థులు -	దాదాపు 25 వేలు
ఫీజులు -	రూ.40 వేల నుంచి రూ.రెండు లక్షలు

నెల్లూరు(టౌన్): తల్లిదండ్రుల ఆశలు.. కొన్ని సీబీఎస్‌ఈ పాఠశాలల యాజమాన్యాలకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండానే వీటిని నిర్వహిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. జిల్లాలో గతంలో ఈ స్కూళ్ల సంఖ్య అతి స్వల్పం. అయితే ప్రస్తుతం 25 పాఠశాలలను నిర్వహిస్తున్నారంటే క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫీజులూ ఆకాశాన్నంటుతున్నాయి.

ఇవీ నిబంధనలు..

- సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) పాఠశాలల నిర్వహణ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగుతుంది. వీటి ఏర్పాటుకు తొలుత జిల్లా విద్యాశాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- కిండర్ గార్డెన్ నుంచి ప్లస్ టూ వరకు లేదా కిండర్ గార్డెన్ నుంచి పదో తరగతి వరకు బోధనకు దరఖాస్తు చేసుకోవాలి.
- పాఠశాలకు రెండెకరాల స్థలం తప్పక ఉండాలి. ఒకే కాంపౌండ్‌లో ఈ స్థలం ఉందనే అంశమై రెవెన్యూ శాఖ నుంచి సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుంది. విశాల మైదానం, గాలి, వెలుతురొచ్చేలా తరగతి గదులు, శానిటరీ, ఫైర్, స్ట్రక్చరల్ సౌండ్‌లెస్ తదితర సర్టిఫికెట్లను విధిగా పొందాలి.
- క్వాలిఫైడ్ టీచర్లు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లు తప్పనిసరి. ఎంఈఓ లేదా డిప్యూటీ డీఈఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని పత్రాలున్నాయా అనే అంశాన్ని తనిఖీ చేశాకే గుర్తింపును జారీ చేస్తారు.
- రాష్ట్ర కమిషనరేట్ నుంచి ఎన్‌ఓసీ వచ్చాక మూడు నెలలకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి గానూ లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలను చలానా రూపంలో బోర్డుకు చెల్లించాల్సి ఉంటుంది. తదనంతరం బోర్డు సభ్యులు వచ్చి తనిఖీలు నిర్వహించి అనుమతులను మంజూరు చేస్తారు.

అంతా డొల్ల..

జిల్లాలో నాలుగైదు మినహా మిగిలిన సీబీఎస్‌ఈ పాఠశాలలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. రెండెకరాల స్థలం ఏ స్కూల్‌కూ లేదు. అపార్ట్‌మెంట్లలో వీటిని నిర్వహిస్తున్న పరిస్థితీ ఉంది. రిజిస్టర్‌లో మాత్రమే క్వాలిఫైడ్ టీచర్ల పేర్లుంటాయి. వాస్తవానికి ఇంటర్, డిగ్రీ, పీజీ అధ్యాపకులే ఉంటారు. బీఈడీ, ప్లస్ - 2కు ఎంఈడీ చేసిన అధ్యాపకులు ఉండాలనే నిబంధన ఉన్నా, ఎక్కడా అమలుకు నోచుకోవడంలేదు. సరైన గాలి, వెలుతురు ఇలాంటివన్నీ మిథ్యే. తనిఖీల నిమిత్తం అధికారులొచ్చిన సమయంలో వారికి రూ.ఐదారు లక్షలను ముట్టజెప్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. దీంతో అన్నీ సక్రమంగానే ఉన్నాయనే నివేదికను తయారు చేసి గుర్తింపును జారీ చేస్తున్న పరిస్థితి ఏర్పడింది.

మా పరిధి అనుమతుల వరకే..



సీబీఎస్‌ఈ పాఠశాలల ఏర్పాటుకు గానూ తొలుత జిల్లా విద్యాశాఖకు దరఖాస్తు చేసుకుంటారు. ఎంఈఓ లేదా డిప్యూటీ డీఈఓ వెళ్లి పరిశీలించాకే గుర్తింపును జారీ చేస్తారు. పాఠశాలల నిర్వహణ, సిలబస్, పరీక్షలు మా పరిధిలో ఉండవు. వీటిని బోర్డు అధికారులే చూసుకుంటారు. – బాలాజీరావు, డీఈఓ

సీబీఎస్‌ఈ సిలబసే ప్రామాణికం



సీబీఎస్‌ఈ సిలబస్‌కు డిమాండ్ ఉంది. ప్రస్తుత పోటీ పరీక్షల్లో ఈ విద్యార్థులే ఎక్కువగా రాణిస్తున్నారు. వీరిలో సృజనాత్మకతా ఎక్కువగా ఉంటుంది. బట్టీ విధానం ఉండదు. ఈ విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రావీణ్యత ఉంటుంది. – గిరి, ప్రిన్సిపల్, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల

ఈ సిలబస్ పైనే ఫోకస్ పెడుతున్నారు



ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ మంది సీబీఎస్‌ఈ సిలబస్‌పైనే ఫోకస్ పెడుతున్నారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఈ విధానమే ప్రధానం. ఫ్యాకల్టీ, బోధనపై ఆరాతీశాకే పిల్లలను మంచి పాఠశాలల్లో చేర్పించాలి. దీన్ని చదివిన పిల్లలకే భవిష్యత్తులో ఉన్నతావకాశాలు ఉంటున్నాయి. – సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రిన్సిపల్, వీఆర్సీ

ఇదేమి ఫీజులు బాబోయ్..

జిల్లాలోని 25కుపైగా సీబీఎస్‌ఈ పాఠశాలల్లో కిండర్ గార్డెన్ నుంచి ప్లస్ – 2 వరకు 25 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. డిమాండ్ పెరగడంతో ఫీజును అమాంతంగా పెంచేశారు. పాఠశాలను బట్టి రూ.40 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారం తదితరాలకు అదనంగా గుంజుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఎన్సీఈఆర్టీ నుంచి వచ్చిన పుస్తకాలతో పాటు సొంత మెటీరియల్‌ను రూపొందించి అంటగడుతున్నారు. ఏటా 10 నుంచి 20 శాతం వరకు ఫీజులను అదనంగా వసూలు చేస్తున్నారు.

తనిఖీలేవీ..?

సీబీఎస్‌ఈ పాఠశాలలను తనిఖీ చేసే అధికారులు కరువయ్యారు. వీటిని తనిఖీ చేసే అధికారం జిల్లా విద్యాశాఖ అధికారులకు లేదు. సెంట్రల్ బోర్డుకు ఫిర్యాదొస్తే తప్ప, వీటివైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. రెండేళ్లకో.. మూడేళ్లకోసారి వచ్చి ముడుపులు పుచ్చుకొని వెళ్తున్నారని సమాచారం. పర్యవేక్షణ కొరవడటంతో నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడింతే పాట అన్న చందంగా పరిస్థితి మారింది.

కాకాణిపై ఆగని కక్షసాధింపు

- ఇప్పటికే ఏడు అక్రమ కేసులు
- తాజాగా మరో నాలుగు వెలుగులోకి
- పరాకాష్టకు కూటమి వేధింపులు

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. రెడ్‌బుక్ రాజ్యాంగంతో విధ్వంసం సృష్టించడం, అక్రమ అరెస్టులకు తెగబడటమే లక్ష్యంగా సర్కార్ చెలరేగిపోతోంది. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి.. తమ వైఫల్యాలు, అసమర్థతను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతల గొంతుకులను నొక్కేందుకు అక్రమ కేసులు బనాయిస్తూ వికటాట్టహాసం చేస్తోంది. జిల్లాలో ఈ తరహా చర్యలు పరాకాష్టకు చేరాయి.



న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చిన అనంతరం కాకాణిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రభుత్వ వైఫల్యాలతో పాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలను నిత్యం ఎండగడుతున్నారనే అక్కసుతో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కూటమి పెద్దలు టార్గెట్ చేశారు. ఆయన్ను కట్టడి చేయాలనే లక్ష్యంతో తప్పుడు కేసులకు తెరలేపారు. పేపర్ కటింగ్‌లను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేశారనే కారణం మొదలుకొని అక్రమ మైనింగ్, అట్రాసిటీ అంటూ ఏడు కేసులు బనాయించారు. అక్రమ మైనింగ్ కేసులో జైలుకు పంపారు. పాత కేసులను తిరగదోడి ఆయనకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా, అందులో ఇరికించే కుట్ర జరుగుతోంది. తాజాగా మరో నాలుగు కేసులు వెలుగులోకి వచ్చాయి. కేసులతో కాకాణిని ముప్పతిప్పలు పెట్టడంతో పాటు ఆయన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగ అమల్లో తలమునకలు

రెడ్‌బుక్ రాజ్యాంగ అమల్లో కొందరు పోలీసులు తలమునకలై ఉన్నారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఫిర్యాదు అందడమే తరువాయిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ కేసులు, అరెస్టులతో భయపడే ప్రసక్తేలేదని పార్టీ శ్రేణులు ఇప్పటికే తేల్చిచెప్పాయి.

ప్రశ్నలతో వేధించి పైశాచికానందం

జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీకి పోలీసులు ఈ నెల ఆరున తీసుకున్నారు. విచారణలో రకరకాల ప్రశ్నలతో వేధించారు.

కేసుల పరంపర

- గుంటూరు జిల్లాలోని తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో గతేడాదిలో ప్రెస్‌మీట్ పెడితే ఆ వార్తను సాక్షి ప్రచురించింది. పేపర్ కటింగ్‌ను తన వాట్సాప్ గ్రూపులో ఫార్వార్డ్ చేశారనే నెపంతో వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.
- వెంకటాచలం మండలానికి చెందిన బీజేపీ నేత నెల్లూరులో ప్రెస్‌మీట్ పెడితే, ఆ వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేశారని మరో కేసుకు తెరలేపారు.
- స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అసభ్యకరంగా పోస్టు పెట్టారంటూ ముత్తుకూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేయించారు
- భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం తెలపడమే అపరాధంగా దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు.
- వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ వెంకటశేషయ్యపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. వీరి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయగా, ఆయన చేసిన వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్త వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.
- కావలి నియోజకవర్గం బోగోలు మండలం కోళ్లదిన్నెలో పార్టీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. గాయపడిన వారిని పరామర్శించి.. పోలీసుల తీరును ఎండగట్టారు. ఆయన చేసిన వ్యాఖ్యలు తమకు బాధ కలిగించాయని టీడీపీ కార్యకర్తల కావలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.
- పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్‌కు సహకరించారంటూ పొదలకూరు పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. అనంతరం నాన్‌బెయిలబుల్ సెక్షన్లు జోడించి అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

తెరపైకి మరో నాలుగు..

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులను హేళన చేస్తూ, వారి ప్రతిష్టకు భంగం కలిగించేలా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మరికొందరితో కలిసి వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో దుష్ప్రచారాలు, వ్యంగ్య చిత్రాలను పోస్ట్ చేస్తున్నారంటూ శాసనసభ్యుడి ముఖ్య అనుచరుడు మేకల సురేంద్ర మంగళగిరిలోని సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాకాణిపై కేసు నమోదైంది. తాజాగా కోర్టు అనుమతితో నేడో, రేపో ఆయన్ను విచారించనున్నారు.
- సర్వేపల్లిలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారంటూ వెంకటాచలం పోలీసులు కాకాణితో పాటు వెంకటశేషయ్య, నిరంజన్‌రెడ్డిపై కేసును రెండు రోజుల క్రితం నమోదు చేశారు.
- కృష్ణపట్నం పోర్టు సమీపంలో టోల్ గేట్‌ను పెట్టి అక్రమంగా నగదు వసూలు చేశారంటూ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, కాకాణి గోవర్ధనరెడ్డిపై ముత్తుకూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది.
- గత ఎన్నికల సందర్భంగా విరువూరు వద్ద మద్యం దొరకగా, అప్పట్లో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. కోర్టులో చార్జిషీట్‌ను సైతం దాఖలు చేశారు. ఆ కేసును తిరగదోడి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సురేష్ పేర్లను చేర్చారు.

నిర్దోషిగా బయటకొస్తారు



పూజితతో మాట్లాడుతున్న తలశిల రఘురామ్, చిత్రంలో చంద్రశేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని, నిర్దోషిగా బయటకొస్తారని ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పేర్కొన్నారు. డైకస్ రోడ్డులోని కాకాణి నివాసంలో ఆయన కుమార్తె పూజితను మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం భయాందోళనకు గురిచేసే పనులు చేయడం సబబు కాదని హితవు పలికారు. సుపరిపాలన అందించకుండా ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి.. వారి అభివృద్ధి కోసం కృషి చేసిన కాకాణికి ఏమీ కాదని, కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు.

యోగా ర్యాలీలు నేడు

నెల్లూరు రూరల్: జిల్లాలో యోగా ర్యాలీలను సోమవారం నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. యోగాంధ్ర ర్యాలీ నిర్వహణపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఆదివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద జిల్లా స్థాయి ర్యాలీని ఉదయం 7.30కు నిర్వహించాలని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని ఆదేశించారు. ఉదయగిరిలో మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నామని వెల్లడించారు.

ఓపెన్ చెస్ టోర్నీ ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మినీబైపాస్‌లోని నక్షత్ర స్కూల్లో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఎస్వీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 234 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులు 66 మంది ఉన్నారు. ఆరు రౌండ్లకు గానూ ప్రణవ్, శైలేష్, పవన్‌తేజ, రామకృష్ణ ఆరు పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్ బాలసుబ్రహ్మణ్యం, ఫిడే మాస్టర్లు ప్రణవ్, మహేశ్వర్, నక్షత్ర స్కూల్ డైరెక్టర్ గాదిరాజు జీవన్‌కృష్ణ, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్, స్కూల్ డైరెక్టర్ సంధ్యారెడ్డి, నిర్వాహకులు వంశీ, సుధాశ్రీ, ఆర్బిటర్లు గోపీనాథ్, రామ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 92 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 92 మంది అభ్యర్థులు ఆదివారం గైర్హాజరయ్యారు. జిల్లాలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1252 మందికి గానూ 1160 మంది హాజరయ్యారు.

ఏపీఈఏపీ సెట్‌లో ఉత్తమ ప్రతిభ

• కందుకూరు విద్యార్థికి పదో ర్యాంక్

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఏపీఈఏపీ) సెట్ ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. గత నెల 19 నుంచి 27 వరకు పరీక్షలను నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగంలో జిల్లాలో 8913 మంది దరఖాస్తు చేసుకోగా, 8558 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 5993 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 2647 మంది దరఖాస్తు చేసుకోగా, 2448 మంది పరీక్ష కు హాజరయ్యారు. 2263 మంది అర్హత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో కందుకూరుకు చెందిన బద్రిరాజు వెంకటమణిప్రీతమ్ 92.43 శాతం మార్కులతో రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో టాప్ టెన్‌లో జిల్లాకు చెందిన ఒకరూ ర్యాంక్‌ను సాధించలేదు.

సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడాలనేదే లక్ష్యం



కందుకూరులో నివాసం ఉంటున్న బద్రిరాజు వెంకటమణిప్రీతమ్ తండ్రి నారాయణమూర్తి, తల్లి రజని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఏపీఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ విభాగంలో 92.43 శాతం మార్కులను ప్రీతమ్ సాధించి రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంక్‌ను దక్కించుకున్నారు. జేఈఈ మెయిన్స్‌లో జాతీయస్థాయిలో 129.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 234వ ర్యాంక్‌ను సాధించారు. ఉత్తమ ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడాలనేదే తన లక్ష్యమని చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీరవుతా..



ఆత్మకూరులో నివాసం ఉంటున్న కార్తీక్ తండ్రి శంకర్ చిరువ్యాపారి.. తల్లి వెంకటసుప్రజ గృహిణి. ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్‌లో 90.05 శాతం మార్కులతో రాష్ట్రస్థాయిలో 35వ ర్యాంక్‌ను కార్తీక్ సాధించారు. జేఈఈ మెయిన్స్‌లో 94.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 396వ ర్యాంక్‌ను దక్కించుకున్నారు. ఐఐటీలో చదివి భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేయాలనేదే తన లక్ష్యమని వివరించారు.

ఐఐటీలో చదవడమే లక్ష్యం



వింజమూరులో నివాసం ఉంటున్న సుంకిరెడ్డి మహిధర్‌రెడ్డి తండ్రి మధుసూదన్‌రెడ్డి దుత్తలూరులోని ఏపీ మోడల్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి సుజాత గృహిణి. ఏపీఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ విభాగంలో 90.42 శాతం మార్కులతో రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంక్‌ను మహిధర్‌రెడ్డి సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో 16.. జేఈఈ మెయిన్స్‌లో 388.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 315వ ర్యాంక్‌ను సాధించారు. ఉత్తమ ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడాలనేదే తన లక్ష్యమని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు



మూలస్థానేశ్వరాలయంలో ప్రాకారోత్సవం



మీనాక్షి సుందరేశ్వరస్వామి సన్నిధిలో..

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో నందీశ్వరుడు, మూలస్థానేశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం, అమ్మవారికి అర్చనలను ఆదివారం నిర్వహించారు. చిన్న వెండి నందివాహనంపై ప్రాకారోత్సవాన్ని జరిపారు. ఈఓ అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

- నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గల మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడు, సుందరేశ్వరుడికి ప్రదోషకాల పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

రాడ్డు బెండింగ్ చేస్తుండగా..

- ఇనుప చువ్వ గుచ్చుకుని వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రాజు మండల్

సీతారామపురం: సీతారామపురం–పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలో భారతమాల ఆరు లేన్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆదివారం రాడ్డు బెండింగ్ పనులు చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజు మండల్ అనే వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మద్యం మత్తులో ఉన్న రాజు మండేల్ రాడ్డు బెండింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ ఇనుప చువ్వ రాజు కంటి పక్కన గుచ్చుకుంది. ఇది లోతుగా దిగడంతో ముక్కు నుంచి రక్తస్రావం అధికమైంది. సహచర కార్మికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌కు గురైన విద్యార్థి మృతి

నెల్లూరు(క్రైమ్): విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థి మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు.. విడవలూరుకు చెందిన ఎం.వెంకటరమణయ్య, పార్వతి దంపతుల చిన్న కుమారుడు హనీష్‌కార్తీక్(17) నెల్లూరు వెంకటేశ్వరపురం ఐటీఐ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 17వ తేదీ నుంచి ఉడ్‌కాంప్లెక్స్‌లోని ఓ ఇంటీరియర్ ఫ్యాక్టరీలో వెల్డర్ విభాగంలో అప్రెంటీస్‌గా చేస్తున్నారు. గతనెల 30వ తేదీన వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. ఫ్యాక్టరీలోని వారు అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. హనీష్‌కార్తీక్‌కు బ్రెయిన్ డెడ్ అయిందని, బతకడం కష్టమని ఈనెల 4వ తేదీన వైద్యులు చెప్పడంతో కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. అయితే బతికే అవకాశం ఏదైనా ఉంటుందేమోనని అదేరోజు నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతుని తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

సంగం: సంగంలోని ఎర్ర చెరువు సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో గాయపడిన ఇద్దరిలో ఒకరు ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెన్నవరప్పాడుకు చెందిన ముత్యాలకోటయ్య (60) మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు. చెన్నవరప్పాడు సర్పంచ్‌గా కోటయ్య గతంలో చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

కండలేరులో 38.687 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 38.687 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,360, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారిపై వాశిలి సమీపంలో గత నెల 26న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిలానీ తెలిపారు. వారి వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం కుప్పురుపాడుకు చెందిన రాగయ్య (51) నెల్లూరు–ముంబై రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందడంతో కేసు నమోదు చేసి ఢీకొన్న వాహనాన్ని గుర్తించనున్నట్లు ఎస్సై వివరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 132
లేయర్ (లైవ్) : 115
బ్రాయిలర్ చికెన్ : 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 262
లేయర్ చికెన్ : 195



పొదలకూరు నిమ్మధరలు(కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



మల్లె రైతుపై దళారీ పడగ

మల్లె సాగు చేసే సన్నకారు రైతులకు గడ్డు పరిస్థితులు తప్పడం లేదు. గిట్టుబాటు ధరల్లేక పెట్టుబడులు కూడా రాకపోవడంతో పూల వాసనతోనే జీవనం సాగించే పరిస్థితి వచ్చింది. సాధారణ మార్కెట్‌లో మల్లెపూలకు మంచి ధరలు పలుకుతున్నా.. దళారుల వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. దీనికి తోడు పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీల ఖర్చుల వల్ల మల్లెసాగుకు దూరమయ్యే పరిస్థితులు వస్తున్నాయి.

మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్న వైనం

- అయినా రైతులకు వచ్చేది అంతంత మాత్రమే
- సిండికేట్‌గా మారి దోచేస్తున్న దళారులు



బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు వద్ద మల్లె సాగులో పనిచేస్తున్న కూలీలు

కోవూరు: జిల్లాలో 175 ఎకరాల్లో రైతులు మల్లె సాగును చేపడుతున్నారు. ఇందులో కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాల పరిధిలోనే దాదాపు 120 ఎకరాల్లో సాగు జరుగుతోంది. వేగూరు, తలమంచి, యల్లాయపాళెం, బుచ్చిరెడ్డిపాళెం, రేబాల, దామరమడుగులో ఈ తోటలు ఎక్కువగా ఉంటాయి.

దళారుల దోపిడీ

పూల మార్కెట్లో దళారుల దోపిడీ ఎక్కువగా ఉంటుంది. వీరు గ్రామాల్లోని తోటల వద్దకు తమ సిబ్బందిని పంపించి అక్కడే తూకం వేసి పూలను కొనుగోలు చేస్తారు. ఆ సమయంలో రైతులకు ధర ఎంత అనేది చెప్పకుండా, ఒక పుస్తకంలో ఎన్ని కేజీలు కొనుగోలు చేసింది మాత్రమే నమోదు చేస్తారు. నెలకు ఒకసారి మొత్తం డబ్బు చెల్లిస్తారు. సీజన్ మొదలైన తొలి మూడు మాసాల్లో మంచి ధర ఉన్నా, రైతులకు మాత్రం నామమాత్రపు ధర అందుతుండడంతో దారుణంగా నష్టపోతున్నారు. దళారులు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలు నిర్ణయించి వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో సన్నకారు రైతులకు మాత్రం న్యాయం జరగడం లేదు. దళారీ వ్యవస్థను నియంత్రిస్తే పూల రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కుతుంది. ఆ దిశగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పూల రైతులు కోరుతున్నారు.

సబ్సిడీ అందించాలి

మల్లెపూల ధరలో సంభవించే హెచ్చుతగ్గుల కారణంగా సాగుదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో కూలి రేట్లు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం ఒక్కో కూలికి రూ.350 చెల్లించాల్సి ఉండడంతో లాభాలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికి, ఇతర పంటలకు సబ్సిడీపై ఎరువులు, పురుగుల మందులు ఇస్తున్నట్లుగా మల్లె రైతులకు కూడా సబ్సిడీపై ఎరువులు పురుగుల మందులు ఇవ్వాలని కోరుతున్నారు. గతంతో పోలిస్తే ఎరువులు పురుగుల మందుల ధరలు రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు మండలాల్లో మల్లెపూలను పండించే రైతులు నెల్లూరులోని పూల మార్కెట్‌కు తరలించి పండించిన పంటను సొమ్ము చేసుకుంటూ ఉంటారు. అయితే అక్కడ మార్కెట్లో పూలను విక్రయించే దుకాణదారులు మల్లె రైతులను ఇబ్బంది పెడుతున్నారని, వారు తక్కువ ధరకు మల్లెపూలను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేయాలి..

కొత్తగా సాగుచేసిన తోట ఓ సారి పూతకు వస్తే పదేళ్ల పాటు స్థిరమైన దిగుబడిని ఇస్తుందని పూల రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 1,600 మొక్కలను పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. మొక్కలు నాటిన తర్వాత తగిన మోతాదులో ఎరువు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. ఆ సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.17 వేల వరకు ఖర్చవుతుంది. పూలు పూయడం మొదలైన తర్వాత పదేళ్ల పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఈ తోటలకు వారానికి ఒకసారి నీరుకడితే సరిపోతుంది. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతలు వంటి సమస్యలు ఉన్నా మల్లె రైతులకు ఇబ్బంది ఉండదు. మల్లె పూల సీజన్ మార్చి నెలలో మొదలై అక్టోబర్ వరకు ఉంటుంది. తొలి మూడు మాసాల్లో కేజీ రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలుకుతాయి. పూలు కోయడానికి వచ్చే కూలీలకు కేజీకి రూ.30 చెల్లిస్తుంటారు. అయితే పండించిన పూలకు తాము ధర నిర్ణయించే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేగూరులో కోతకు సిద్ధంగా ఉన్న మల్లె సాగు

నెల్లూరు మార్కెట్‌లో గది ఇవ్వాలి



ప్రస్తుతం మేము పండించిన పూలను మేమే అమ్ముకునే పరిస్థితి లేదు. దళారుల చేతిలో మోసపోవడమే మాకు దిక్కుగా మారింది. నెల్లూరు పూల మార్కెట్‌లో మా మల్లె పూలను అమ్ముకునేందుకు ఒక గదిని ఏర్పాటు చేయాలి. దీనిపై ఎంతమంది అధికారులకు మొరపెట్టుకున్నా, ఆలకించేవారు లేరు.

– అమారి బాబు, మల్లె రైతు, వేగూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరుగాలం కష్టపడి పండించిన మల్లె పూలను దళారులు తక్కువ ధరకే తీసుకుపోతున్నారు. మా శ్రమ వృథా అవుతోంది. దీనిపై ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా, మా బాధను ఎవరూ ఆలకించడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– రమణయ్య, మల్లె రైతు, సుబ్బారెడ్డిపురం

రాయితీపై అందజేయాలి



ప్రభుత్వం మల్లె సాగు చేస్తున్న రైతులకు అవసరమైన పనిముట్లను రాయితీపై అందించాలి. అప్పుడు కొత్తగా మల్లె సాగుపై రైతులు ఆసక్తి చూపుతారు. పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

– నర వెంకటేశ్వర్లు, మల్లె రైతు, వేగూరు

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- డీఈఓ కార్యాలయ ముట్టడి

నెల్లూరు (టౌన్): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన అవకతవకలకు రివైజ్డ్ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్‌ను తప్పుల తడకగా నిర్వహించారని, క్లస్టర్ వేకెన్సీలకు ఎక్కువ పాయింట్లు వచ్చిన వారికి కాకుండా తక్కు వ పాయింట్లు వచ్చిన వారికి ఇచ్చారని చెప్పారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపాధ్యాయులు జనరల్ ఆప్షన్లు పెట్టినా ప్లేసులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. బాలికోన్నత పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను కేటాయించడం లాంటి పొరబాట్లు జరిగాయన్నారు. ఈ రీతిలో విఫలమైన వెబ్ కౌన్సెలింగ్‌ను ఎస్జీటీలపై బలవంతంగా రుద్ద డం దుర్మార్గపు చర్యన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఎస్జీటీలకు మాన్యు వల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు సురేంద్రరెడ్డి, చలపతిశర్మ, అనిల్, నరసింహులు, హజరత్, కృష్ణారెడ్డి, మధుసూదనరావు, శివశంకర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, పద్మజ, మస్తాన్, మునీంద్ర, పిచ్చిబాబు, రాజగోపాలాచారి, శేషులు, దశరథరాము లు, అజయ్‌బాబు, డేవిడ్, సుబ్రహ్మణ్యం, సురేష్, సుజాత, రవి, రమేష్, నవ కోటేశ్వరరావు, రియాజ్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు డీఈఓ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



భారీగా తరలివచ్చిన ఉపాధ్యాయులు

సహజ ఎరువులతో ఆరోగ్యం

- భారతీయ వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త నాగేశ్వరరావు

కొడవలూరు: సహజ సిద్ధమైన ఎరువులను వినియోగించి పంటలను సాగు చేయడం ద్వారా భూమి ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తులు ప్రజలకు అందుతాయని భారతీయ వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డీవీకే నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగేశ్వరరావు విచ్చేసి, మాట్లాడారు. భూసార పరీక్షలు తప్పనిసరని, ప్రతి రైతు గుర్తించుకోవాలన్నారు. తద్వారా భూమి ఆరోగ్యం తెలుసుకుని ఎరువులు వినియోగించుకోవచ్చన్నారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానం తెగుళ్ల శాస్త్ర విభాగం శాస్త్రవేత్త పి.మధుసూదన్ మాట్లాడుతూ మొక్కల్లో రోగ లక్షణాలను గుర్తించి తగిన మందులను మోతాదు మేరకు ఉదయం, సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలన్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జీవన ఎరువులు వాడుకుని రసాయన ఎరువులను 25 శాతం వరకు తగ్గించుకోవాలని చెప్పారు. ఏఓ లక్ష్మి మాట్లాడుతూ నీటి యాజమాన్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే పిలకలు సకాలంలో వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఆర్.నిహారిక, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేశ్వరరావు

భూవివాదంలో మహిళకు గాయాలు



వివాదాస్పద భూమిలో జామాయిల్ చెట్లను తొలగిస్తున్న జేసీబీ



ప్రశ్నించిన పల్లవిపై దాడికి పాల్పడుతున్న బంధువులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నరసాపురంలో 2.50 ఎకరాల భూ వివాదానికి సంబంధించి ఘర్షణ ఏర్పడి ఓ మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు వివరాల మేరకు.. అల్లంపాటి మాధవరెడ్డి, పల్లవి దంపతులకు వారి పెద్దల నుంచి భూమి వచ్చింది. అందులో తమకు 30 సెంట్లు రావాలని వారి దూరపు బంధువులు అంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సోమ్లానాయక్ గత బుధవారం రెవెన్యూ కోర్టు నిర్వహించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో మరోసారి రెవెన్యూ కోర్టు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మాధవరెడ్డి దంపతులకు తెలియకుండా వారి బంధువులు ఆదివారం జేసీబీ సాయంతో 30 సెంట్లలో జామాయిల్ చెట్లు తొలగించి ఫెన్సింగ్ వేశారు. విషయం తెలుసుకుని సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన మాధవరెడ్డి కుటుంబీకులపై వారు దాడికి పాల్పడ్డారు. ఇందులో పల్లవికి గాయాలయ్యాయి.

ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు

- సంక్షేమ శాఖల్లో నిబంధనలు పాటించని వైనం
- బయటపడుతున్న పైరవీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల బదిలీల్లో అక్రమాలు అధిక సంఖ్యలో బయటపడుతున్నాయి. రెండు శాఖల్లో బదిలీల జాబితాల్లో కొద్దిపాటి లోపాలను ఉద్యోగులు ఎత్తిచూపెట్టడంతో ఆ లిస్టులను డీఆర్‌ఓకు పంపారు. దీంతో సోమవారం బదిలీలు చేసేందుకు చివరి తేదీగా ఖరారు చేశారు. అయితే సాంఘిక సంక్షేమ శాఖలో యూనియన్ లీడర్లు 14 సంవత్సరాలు పైబడిన వారు సైతం అదే స్థానాల్లో కొనసాగించేందుకు తప్పులు చేశారు. వారు ఎరగా ఇచ్చిన డబ్బులు, వస్తువులు, లిస్ట్‌లను, వీడియోలను, ఫోన్లలో మాట్లాడిన రికార్డులను చూపిస్తూ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే చెవులు కొరుక్కోవడం ఆశ్చర్యం కలిగించకమానదు. ఇంకొక అడుగు ముందుకేసి తిరుపతిలో ఉన్న ఉద్యోగులను అర్హత లేకపోయినా నెల్లూరు లిస్టులో పెట్టడం, నెల్లూరులోకి రావాల్సిన వారిని తిరుపతిలో మారుమూలలకు వేయడం లాంటి పేర్లను ఆ జాబితాల్లో చేర్చేందుకు అధికార పార్టీ నాయకులు, ఆయా సామాజిక వర్గాలకు చెందిన నేతలు డీఆర్‌ఓపై కూడా ఒత్తిడి తెస్తున్నట్లు ఏ సిఫార్సులు లేని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

బీసీ సంక్షేమ శాఖలో...

జిల్లా బీసీ సంక్షేమ శాఖలో సైతం బదిలీల లిస్టును ఇష్టారాజ్యంగా రూపొందించారని ఉద్యోగులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు నిమిత్తం లేకుండా కొద్దిపాటి సరీ్వసు ఉన్నవారిని మంచి ప్రాంతాలకు బదిలీ చేసేందుకు ధనం, రాజకీయ బలం ఎక్కువగా పనిచేస్తున్నాయి. ఆత్మకూరుకు చెందిన అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ నేతృత్వంలో నెల్లూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనర్హులకు వారు కోరుకున్న స్థానాలకు బదిలీ చేసేందుకు చేసిన సన్నాహాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బీసీ శాఖలో ఉన్నతాధికారులు అత్యంత గోప్యంగా ఉండే విషయాలు ఎలా బయటకు వచ్చాయని ప్రతి ఒక్క సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలు సాధారణ బదిలీలను నియమ నిబంధనలను అనుసరించి పారదర్శకంగా చేయకుండా ఆ శాఖలో అధికారులు, ఉన్నత ఉద్యోగులు చేసిన అక్రమాల వల్లే ఇంత గొడవలు చోటు చేసుకున్నాయి.

ఇప్పటి వరకు జరిగిన ప్రక్రియను పక్కన పెట్టి తాజాగా ఉద్యోగుల ఖాళీల జాబితాను బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఆయా శాఖలు ముందుగానే తెలిపి పారదర్శకంగా బదిలీలు జరపాలని డీఆర్‌ఓను ఉద్యోగులు కోరుతున్నారు. అయితే రాజకీయ, యూనియన్ నాయకుల బేరసారాలకు లొంగి ఇవే బదిలీలను ఈలోపే ఖరారు చేస్తారా అని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అందరికి న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.